క్లుప్తంగా

కబ్జా చేసిన భూమిని కాపాడాలి

ధరూరు: మండల పరిధిలోని చింతరేవుల గ్రామంలో 10 గుంటల భూమిని కబ్జాదారుడి నుంచి తమకు ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్వే నంబర్ 680లోని 10 గుంటల భూమిని గ్రామానికి చెందిన భీంసేన్‌రావు 1990లో హోమియోపతి ఆస్పత్రి నిర్మాణం కోసం గతంలో రిజిస్ట్రర్ చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం గద్వాలకు చెందిన మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ ఆ భూమిని ఉన్న పాలాన్ని కొని.. గ్రామ అవసరాల కోసం ఇచ్చిన భూమిని కబ్జా చేసి ప్లాట్లు వేస్తున్నారని ఆరోపించారు. కబ్జా విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన డాక్టర్ వెంకటన్న, ఈశ్వర్, నారాయణ తదితరులు పేర్కొన్నారు.

కళాశాల వసతి గృహంగా మార్చాలి



గట్టు: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఇంటర్ విద్యార్థుల వసతి గృహంగా మార్చాలని మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ కలెక్టర్ బీఎం సంతోష్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఎస్సీ వసతి గృహం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మాత్రమే ఉందని, ఇందులో విద్యార్థులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నట్లు తెలిపారు. గట్టులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 320 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరంతా గట్టుతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిపోయేవారన్నారు. ఎస్సీ వసతి గృహాన్ని ఇంటర్ విద్యార్థులకు ఉపయోగపడే వసతి గృహంగా మార్చాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

ఎర్రవల్లి: మండల పరిధిలోని రాజశ్రీ గార్లపాడు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన రాము కుటుంబ సభ్యులకు బీమా చెక్కును బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మెనేజర్ రాఘవేంద్రారెడ్డి అందజేశారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. మృతుడు రాము ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా ఇన్సూరెన్స్ చేసుకోవడం ద్వారా రూ.2లక్షల బీమా అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి సాయికుమార్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్స్ మధు, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలి

ఇటిక్యాల: మండల కేంద్రం గుండా సాతర్ల, వెంకటాపురం వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దులా అన్నారు. బుధవారం గ్రామ గ్రామానికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నాయకులతో కలిసి రోడ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల నుంచి రోడ్డుకు ప్రభుత్వం కనీస మరమ్మతు చేయడం లేదన్నారు. సాతర్ల, యాపదిన్నే గ్రామాల దగ్గర ఉన్న కల్వర్టును పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేశారన్నారు. రోడ్లపై గుంతలతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్నిక

గద్వాలటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా తోట శ్రీనివాసులు నియమితులయ్యారు. బుధవారం డీఈఓ అబ్దుల్ ఘని చేతుల మీదుగా ఉత్తర్వులను అందుకున్నారు. శ్రీనివాసులు ఉండవెల్లి మండలం పుల్లూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. శ్రీనివాసులు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల్లో బీజేపీని గెలిపించండి



ఎర్రవల్లి: రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీకి ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపిచాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సందర్శించి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. మల్లేష్, దేవదాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనం బోల్తా

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై పత్తి మిల్లు సమీపంలో బుధవారం రాత్రి కూరగాయల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో రహదారిపై ట్రాఫిక్ జాం ఏర్పడింది. హైవే సిబ్బంది ట్రాఫిక్‌ను అదుపు చేశారు.

ఆదరణతోనే పూర్వ వైభవం

'చేనేత, వ్యవసాయం కవల పిల్లలవంటివి. చేనేత మగ్గం మన జాతికి మరో హృదయం వంటిది '
- జాతిపిత మహాత్మాగాంధీ

- కార్మికులకు మరింత ప్రోత్సాహం అవసరం
- నేడు జాతీయ చేనేత దినోత్సవం



చేనేత మగ్గం

గద్వాలటౌన్ : దాదాపు నాలుగు దశాబ్దాల కిందట జిల్లాలో వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన చేనేత రంగం ఆటుపోటులను ఎదుర్కొంటుంది. ప్రభుత్వం నుంచి ఆశించిన ప్రోత్సాహం లేక చేనేత సహకార సంఘాలు నిర్వీర్యంగా మారుతున్నాయి. చేతినిండా పనిలేక, చేస్తున్న వారికి తగిన ఆదాయం రాక చేనేత కార్మికులు వృత్తికి దూరమవుతున్నారు. చేనేత దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం చేనేత రంగాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని పలువురు చేనేత కార్మికులు కోరుతున్నారు.

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు

- టెస్కో ద్వారా వస్త్రాల కొనుగోలుకు నిర్ణయం.
- ప్రభుత్వం చేనేత రుణమాఫీ ప్రకటించింది.
- నేతన్నకు ఆర్థికంగా భరోసానిచ్చే థ్రిఫ్ట్ పథకం కొనసాగుతుంది.
- ప్రధానమంత్రి వీవర్స్ ముద్ర యోజన ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నారు. రూ.50 వేల చొప్పున రుణంగా అందుతుంది.
- చేనేత బీమా అమలు

పెట్టుబడి సాయం అందించాలి



రైతులకు ఇస్తున్న తరహాలోనే చేనేత కార్మికులకు పెట్టుబడి సాయం అందించాలి. ప్రభుత్వం సంఘాలను ప్రోత్సహించి చేనేత కార్మికులను ఆదుకోవాలి. కరెంటు రాయితీ వర్తింపజేయాలి. జీవన భృతిని అమలు చేసి కార్మికులను ఆదుకోవాలి. – రామలింగేశ్వరకాంబ్లే, చేనేత క్లస్టర్ చైర్మన్, గద్వాల

జీవనభద్రతకు ప్రాధాన్యం



చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. కార్మికుల జీవనభద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఆ దిశగానే బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటున్నాయి. నేతన్నకు బీమా పథకం అమల్లో ఉంది. చేనేత రుణమాఫీ ప్రక్రియ అమలవుతుంది. – గోవిందయ్య, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు, గద్వాల

నాటి వైభవం తిరిగొచ్చేనా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు దశాబ్దాల కిందట వేలాది మగ్గాలు ఉండేవి. జిల్లాలోని గద్వాల, రాజోళి, గట్టు, మాచర్ల, గొర్లఖాన్‌దొడ్డి, నారాయణపేట, అమరచింత, ధన్వాడ, కొత్తకోట తదితర ప్రాంతాల్లో దాదాపు పదివేల కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి జీవించేవి. అనేక గ్రామాల్లో చాలామంది ఇళ్లల్లో కూడా వందలాది మగ్గాలు ఉండేవి. మహిళలు ఇళ్లలో కండెలు చుట్టడం, రంగులు అద్దడం వంటి పనులు చేసేవారు. చేతినిండా పని ఉండటంతో కార్మికుల అవసరాలు తీరేవి. అప్పట్లో చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహించేది. నేటి పాలకులు చెప్పడమే కానీ చేసిందేమీ లేదు. మరమగ్గాలు, అధునాతన వస్త్ర ఉత్పత్తి యంత్రాలు వచ్చాక ప్రజలు ఆధునిక నమూనా (డిజైన్లు) ఆకర్షితులు కావడంతో చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గింది. ఆధునిక వస్త్రాలతో పోలిస్తే చేనేత వస్త్రాల ఉత్పత్తి వ్యయం కాస్త ఎక్కువగా ఉండి పని కల్పించలేని పరిస్థితి ఉత్పన్నమైంది. చేసిన పనికి గిట్టుబాటు కావడం లేదు.

ప్రతిబంధకాలకు ప్రత్యామ్నాయాలివే..!

- రూ.లక్షల పెట్టుబడి పెట్టి నూలు, ఇతర ముడి సరుకుల కొనుగోలు చేసే స్తోమత సంఘాలకు లేదు. ఉత్పత్తి లేనందున కార్మికులకు పని లభించడం లేదు. సంఘాలకు ప్రభుత్వం మూలధనం సమకూర్చాలి. ముడి సరుకుల కొనుగోలుకు రాయితీలు ఇవ్వాలి.
- ఆధునిక వస్త్రాల తయారీ, మార్కెటింగ్‌లో సంఘాలు ఇబ్బందిని ఎదుర్కొంటున్నాయి. వాటిని అధిగమించడానికి ప్రభుత్వం సహకరించాలి.
- చేనేత కార్మికులకు తగిన ఆదాయం రాక పనులు మానుకుంటున్నారు. ఉపాధి హామీ పథకాన్ని చేనేత రంగానికి అనుసంధానించి కార్మికులకు ఎక్కువ ఆదాయం వచ్చేలా చేయాలి. - బీడీ కార్మికుల మాదిరి జీవన భృతి ఇవ్వాలి.
- రైతులకు పెట్టుబడి సాయం తరహాలో చేనేత కార్మికులకు కూడా పెట్టుబడి సాయాన్ని అందించాలి. జియోట్యాగింగ్ ఉన్న ప్రతి మగ్గానికి పెట్టుబడి సాయం అందించే విధంగా చర్యలు చేపట్టాలి.
- నిరుద్యోగ యువత చేనేత వృత్తి వైపు ఆసక్తి కనబర్చడం లేదు. వారికి ఆధునిక డిజైన్లలో వస్త్రాల తయారీకి శిక్షణనిచ్చి ఉపాధి కల్పించాలి. సొంత మగ్గాల స్థాపనకు రాయితీపై రుణ సదుపాయం కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇదీ జిల్లాలో చేనేత పరిస్థితి..	ప్రస్తుతం నేత కార్మికులు	చేనేత సొసైటీలు	మాస్టర్ వీవర్స్	చేనేత మగ్గాలు	ఇతర పనులకు, వలస వెళ్లిన కార్మికులు
	11,041	107	సుమారు 100మంది	4,296	సుమారు 1,000మంది

బకాయి బిల్లులు, వేతనాలు చెల్లించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాలటౌన్: మధ్యాహ్న భోజనం వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. నిధుల విడుదలకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీఈఓ అబ్దుల్ ఘనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలల నుంచి వేతనాలు, సంవత్సరం నుంచి గుడ్డు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో తన వాటాను ఇవ్వడం లేదని, దీంతో బిల్లుల చెల్లింపులో మరింత ఆలస్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిల్లులను సకాలంలో చెల్లించకపోవడం వలన కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులను విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పేరు నర్సింహ, గట్టన్న, మల్లీశ్వరి, రాధమ్మ, వీరేషమ్మ, శేషమ్మ, శైలజ, పరిమళ, పద్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

అలంపూర్: హమాలీ కార్మికులకు ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. అలంపూర్ చౌరస్తాలో హమాలీ కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బరువులు మోస్తూ అనారోగ్యాలకు గురువుతున్న పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహకారం అందడం లేదన్నారు. కార్మికులు ప్రమాదాల బారినపడితే కుటుంబాలు ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హమాలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవదాసు, సీపీఎం కార్యదర్శి మద్దిలేటి, వెంకటేశ్వర్లు, నూర్ అహ్మద్, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేయాలని చూస్తున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గద్వాల: బీసీ బిల్లు పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేయాలని చూస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. బుధవారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేయడాన్ని ఎద్దేవా చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని కానీ బీసీల పేరిట ముస్లింలకు ఇస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీ వ్యక్తిని ప్రధానిని చేశారా అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీ, ప్రస్తుత తెలంగాణలో ఏ ఒక్క బీసీకైనా సీఎం పదవిని ఇచ్చారా అని మండిపడ్డారు. రాష్ట్ర క్యాబినెట్‌లో నామినేటెడ్ పదవులను ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా పిలుపునిచ్చారు. ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ బీసీల రిజర్వేషన్లు తెరమీదకు తీసుకొచ్చినటు పేర్కొన్నారు. కార్యక్రమంలో బండల వెంకట్రాములు, రవి, చిత్తారి కిరణ్, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య పాలనకు అద్దం పడుతున్నాయి



కోవెలదిన్నె రోడ్డుపై వర్షపు నీటిలో నిల్చొని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రాజోళి: గుంతలమయంగా ఉన్న రోడ్లపై నిలిచిన వర్షపు నీటిలో నిలబడి బీజేపీ నాయకులు నిరసన తెలియచేశారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్–కోవెలదిన్నె రోడ్డును బాగు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. బుధవారం కోవెలదిన్నె రోడ్డుపై ఉన్న మోకాళ్లలోతు గుంతల్లో నిలిచిన వర్షపు నీటిని చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అధ్వాన్న రోడ్ల దుస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని మండిపడ్డారు. గుంతలమయమైన రోడ్లు వారి నిర్లక్ష్య పాలనకు అద్దం పడుతున్నాయన్నారు. గ్రామీణ రోడ్లకు తక్షణమే మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మోహన్‌యాదవ్, ఈశ్వర్, శేఖర్, నరేష్, రాఘవేంద్ర, గోవర్ధన్, హరి, అయ్యరాజు తదిదరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై గ్రామసభ



మల్దకల్: మండలంలోని మంగంపేట గ్రామంలో ఉపాధి హామీ పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు బుధవారం గ్రామసభ నిర్వహించారు. స్థానిక పాఠశాలలో ఉపాధి హామీ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు. గ్రామంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి వరకు చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. బృందం సభ్యులు గ్రామంలో తిరిగి పనులు చేసిన ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు ఉమేరా, నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు గోపాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వకుళసాళి సమాజ్ కార్యవర్గం ఎన్నిక

గద్వాలటౌన్: స్వకుళసాళి సమాజ్‌తో పాటు యువజన విభాగం, మహిళా మండలి నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక వేదనగర్ కాలనీలోని జిహ్వేశ్వర కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆనందరావురావుత్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్ సాత్రే, కోశాధికారిగా వసంత్‌రావు సపారే, ఉపాధ్యాక్షుడిగా సురేందర్ కాంబ్లే సంయుక్త కార్యదర్శిగా సరేష్‌కుమార్ సాత్రే ఎన్నికయ్యారు. మహిళా మండలి నూతన అధ్యక్షురాలిగా గాయత్రి కాంబ్లే, ప్రధాన కార్యదర్శిగా అర్చన ఎక్బోటే, కోశాధికారిగా వరలక్ష్మి ధోత్రే, ఉపాధ్యాక్షులుగా నిర్మల ధోత్రే, లక్ష్మీదేవి సాత్రే సంయుక్త కార్యదర్శులు జ్యోతి ఎక్బోటే, రేఖసాత్రే ఎన్నికైనట్లు సంఘ సభ్యులు పేర్కొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన



మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత మూడు నెలల నుంచి తాగునీటి కొరతతో నానా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కనీస అవసరాలకు కూడా నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యను పరిష్కారించకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీరు విడుదలకు కృషి



కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: చివరి ఆయకట్టుకు నీరు విడుదల చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇర్కిచేడు, ముసల్‌దొడ్డి శివారులోని ర్యాలంపాడు రిజర్వాయర్ కింద ఉన్న డీ9 కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాల్వ కింద 3,000 ఎకరాల్లో పత్తి, వరి, మొదలగు పంటలు సాగు చేస్తున్నారని, ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామన్నారు. ఆయకట్టుకు నీళ్లు అందే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, నాయకులు చంద్రశేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాలరాస్తే చర్యలు



పెద్దతాండ్రపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజోళి: బాలల హక్కులను కాలరాస్తే చట్టపరంగా కఠిన చర్యలుంటాయని చైల్డ్ వెల్ఫేర్ ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మండలంలోని పెద్ద తాండ్రపాడులో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీహెచ్‌పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. యానిమేషన్ ద్వారా బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వలన కలిగే నష్టాలు తెలియచేశారు. తల్లిదండ్రులు బాలలతో ఎలా మెలగాలి, ఎలాంటి సంభాషణలు చేయాలనే అంశాలను చిత్రమాలిక ద్వారా తెలియచేశారు. అనంతరం పొలాల్లో పనిచేస్తున్న వారికి బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి, స్కూల్ చైర్మన్ సంతోషమ్మ, పద్మ, చిట్టెమ్మ, దస్తగిరి, సువర్ణమ్మ, రాజేశ్వరి తదిదరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

మల్దకల్: బడిఈడు పిల్లలను బాల కార్మికులుగా మారిస్తే కఠినచర్యలు తప్పవని సీసీఎస్ ఎస్ఐ కేశవరావు అన్నారు. మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నేరమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతోనే సమృద్ధిగా పోషకాలు



మల్దకల్‌లో తల్లిపాల వారోత్సవాల్లో సీడీపీఓ హేమలత

మల్దకల్: తల్లిపాలతోనే సమృద్ధిగా పోషకాలు లభిస్తాయని సీడీపీఓ హేమలత అన్నారు. బుధవారం మల్దకల్, బిజ్వారం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని సూచించారు. అదే విధంగా పోషకాలు ఎక్కువగా ఉండే పండ్లు, పాలతో పాటు ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీరంగమ్మ, మహేశ్వరమ్మ, పుష్పమ్మ, అనంతమ్మ, పార్వతమ్మ, వరలక్ష్మి, లక్ష్మీ ఏఎన్ఎంలు అజుబా, మరియమ్మ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



ర్యాలంపాడు పునరావాస కేంద్రంలో భూమిపూజ చేస్తున్న సుదర్శన్‌రెడ్డి

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ముంపునకు గురైన ర్యాలంపాడు ఆర్అండ్ఆర్ సెంటర్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. బుధవారం మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి లబ్ధిదారులతో కలిసి భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచులు అంపన్న, తిమ్మప్ప, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రంగన్నగౌడ్, బాలు, నర్సింహులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలని, వేగంగా నిర్మాణం పూర్తి చేసి బిల్లులు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీధర్, వీరేష్, వెంకన్న, భాను తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సేవలు చిరస్మరణీయం



గద్వాలలో నివాళులర్పిస్తున్న ప్రజా, కుల సంఘాల నాయకులు



రాజోళిలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమాన్ని ఆత్మగౌరవ ఉద్యమంగా మలచిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని పలువురు వ్యక్తలు, ఉపాధ్యాయులు, నాయకులు కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధనకు ఆయన చేసిన కృషిని కొనియాడారు.

✡ గద్వాలలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా, ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మీనాక్షి ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా కృష్ణవేణి చౌరస్తాలో గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వాల్మీకి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మోహన్, మధుసుదన్‌బాబు పాల్గొన్నారు.

✡ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని తహసీల్దార్ వీరభద్రప్ప అన్నారు. ఇటిక్యాల రెవెన్యూ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నందిని, ఆర్ఐ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

✡ ధరూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేందర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు కలెక్టర్ నర్సింగరావు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✡ మల్దకల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఝాన్సీరాణి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, పోలీసుస్టేషనులో ఎస్ఐ నందికర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్వరూపరాణి జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, నరసన్న, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✡ గట్టులో ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయకుమార్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

✡ అయిజ మండల కేంద్రంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను అధికారులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు.

✡ మానవపాడు మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడు వెంకటకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో జయశంకర్ సేవలను కొనియాడారు.

✡ ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలు మరువలేనివని వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ రాజయ్య అన్నారు. రాజోళి పురపాలక సంఘ కార్యాలయంలో జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ రాజశేఖర్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



ధరూరులో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు